ప్రజాశక్తి

శనివారం 5 ఏప్రిల్ 2025 5

శ్రీ సత్యసాయి





పట్టణంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ముస్లిములు

ముస్లిములపై బిజెపి కుట్ర

వక్ఫ్ బిల్లు రాజ్యాంగ విరుద్ధం
ప్రధాని, ముఖ్యమంత్రులకు వ్యతిరేకంగా పురంలో ముస్లిముల భారీ నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేయాలన్న దురుద్దేశంతో ముస్లిములపై కుట్రపూరితంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌సవరణ చట్టం సవరణ చేస్తోందని పలువురు ముస్లిములు, వైసిపి నాయకులు పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డు బిల్లు సవరణపై ముస్లిం మైనార్టీలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా హిందూపురం పట్టణంలో శుక్రవారం వైసిపి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం నమాజ్ అనంతరం హిందూపురం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు వేణు రెడ్డి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఉన్న వక్ఫ్ బోర్డు ముస్లిం మైనార్టీలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటున్నాయి. అలాంటి వక్ఫ్ బోర్డుపై కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా సవరణలు చేస్తోందన్నారు. ముస్లింలకు రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్ఛను హరించడానికే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు తెచ్చిందన్నారు. దీనికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. వక్ఫ్ సవరణ చట్టం 2025 బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బిల్లును అమలు చేయాలని చూస్తే బిజెపి, టిడిపి, జనసేన ముస్లిముల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ నుంచి సద్భావన సర్కిల్ మీదుగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ మైనొద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు వేణుగోపాల్ రెడ్డి, వైస్ ఛైర్మన్ జబీవుల్లా, ముస్లిం కౌన్సిలర్లు, ముస్లిములు పాల్గొన్నారు.

జుడియో ఎ క్యాకియా..!

◆ నిర్మాణ పనులు సాగుతుండగానే ప్రారంభం

◆ చిన్నపాటి వర్షానికి కూలిన సైడ్‌వాల్ ◆ ప్రమాదం జరిగితే అంతేనా..?



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మల్టీప్లెక్స్ మాల్ నిర్మాణం పూర్తవకనే 'జుడియో' సంస్థ ప్రారంభోత్సవం చేపట్టింది. అనంతపురం రూరల్ పరిధిలోని పాపంపేట పంచాయతీ పరిధిలో ఐదు అంతస్తుల్లో రెండు అంతస్తుల భవన నిర్మాణం జరుగుతోంది. పై అంతస్తుల్లో ఇంకా పనులు సాగుతున్నాయి. ఓ వైపు నిర్మాణ పనులు జరుగుతుండగానే మరోవైపు గత నెలలో ఈ మాల్ ప్రారంభోత్సవం జరిగింది. కార్పొరేట్ సంస్థ దుకాణం తెరవడంతో పెద్దఎత్తున జనం కూడా బట్టల కొనుగోళ్లకు వెళ్తున్నారు. జనం ఎక్కువ వెళ్తున్న నేపథ్యంలో ఇంకా నిర్మాణ పనుల్లో ఉన్న భవనంలో ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. గురువారం రాత్రి కురిసిన ఒక మోస్తరు వర్షానికే జుడియో పై అంతస్తుల్లోని సైడ్‌వాల్ ఊడి రోడ్డుపై పడింది. ఆ సమయంలో ఎవరూ అటువైపు వెళ్లకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లేకపోతే అటువైపు వెళ్లే వారిపడి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగే అవకాశాలుండేవి.

కళ్లుమూసుకున్న అధికారులు

నిబంధనలను ఏ మాత్రం పాటించకుండా ఒక పెద్ద సంస్థ హంగామాతో ప్రారంభోత్సవం చేపట్టినా అధికారులు మాత్రం కళ్లు మూసుకుని మౌనం వహించడం విమర్శలకు తావిస్తోంది. ఇంత పెద్ద మాల్ నిర్మాణం చేపట్టిన సమయంలో వివిధ దశల్లో అధికారులు పరిశీలించాలుంటాయి. భవన నిర్మాణ సమయంలో మొదటగా అగ్నిమాపక శాఖ అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఆ తరువాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందాలి. నిర్మాణం పూర్తయ్యాక ఏదైనా లోటుపాట్లు ఉంటే అధికారులు పరిశీలించి వాటిని సవరించిన తరువాత ప్రారంభోత్సవాలకు అనుమతినివ్వాల్సి ఉంటుంది. ఆ తరువాత ఇందులో వ్యాపార సంస్థలు నిర్వహించుకునేందుకు వీలుంటుంది. కాని జుడియో అనంతపురంలో ఏర్పాటు చేస్తున్న భవనానికి సంబంధించి అటువంటి నిబంధనలు ఏవీ పాటించకుండానే ప్రారంభోత్సవం ఘటనంగా జరిగింది. ఇంత జరిగినా అధికారులు మాత్రం తమకేమి సంబంధం లేనట్లుగా మౌనం వహించడం అనేక విమర్శలకు తావిస్తోంది.



గురువారం కురిసిన వర్షానికి కూలిపోయిన జుడియో సైడ్‌వాల్

మా కార్యాలయం నుంచి అనుమతుల్లేవు

అనంతపురంలో జుడియో ప్రారంభించిన నూతన భవన నిర్మాణానికి సంబంధించి మా కార్యాలయం నుంచి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. ఇప్పుడు అంతా ఆన్‌లైన్ పద్ధతుల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఆ రకంగా ఆ భవనానికి ఆన్‌లైన్‌లో మా పై అధికారుల నుంచి ఏదైనా అనుమతి పొంది ఉంటే అది తమ దృష్టిలో లేదు. మా కార్యాలయం నుంచి మాత్రం ఎటువంటి అనుమతిలేదు.

శ్రీనివాసరెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి.

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందలేదు

జుడియో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇంకా పొందలేదు. నిర్మాణ పనులు సాగుతున్నాయి. అప్పుడే ప్రారంభించవద్దని కూడా ఆ భవన నిర్మాణం చేపట్టిన వారికి సూచించాం. నిబంధనల మేరకు నిర్మాణం జరగాల్సి ఉంది. నిర్మాణం పూర్తయిన తరువాత పరిశీలించి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇస్తాం.

ఇషాక్, అహుడా ప్లానర్.

జిల్లాలో 614 మి.మీ. వర్షం

పుట్టపర్తి అర్బన్ : జిల్లాలో గురువారం రాత్రి 8 గంటల నుంచి శుక్రవారం ఉదయం 8 గంటల వరకు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 614.0 మి.మీ. వర్షపాతం నమోదయినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 32 మండలాలకుగాను ఐదు మండలాలు మినహా మిగిలిన 27 మండలాల్లో ఒక మోస్తరుతో పాటు కొన్నిచోట్ల భారీగా వర్షం పడింది. ఈదురు గాలులకు పలుచోట్ల మామిడి తోటల్లో మామిడికాయలు రాలిపడ్డాయి. నల్లమాడ మండలంలో వరి పంట, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. అత్యధికంగా నల్లమాడ మండలంలో 59.4 మి.మీ., కనగానిపల్లిలో 51.4, పుట్టపర్తిలో 51.4, చెన్నేకొత్తపల్లిలో 45.6, వర్షం కురిసింది. అకాల వర్షానికి చేతికొచ్చిన వరి పంట సుమారు 20 హెక్టార్లలో దెబ్బతినింది. 25 ఎకరాల్లో మామిడికాయలు గాలికి రాలిపోయినట్లు అధికారులు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన పంట నష్టం అంచనాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

సమ్మెలోకి శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులు

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం : ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లింపుల్లో జాప్యాన్ని నిరసిస్తూ శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులు శుక్రవారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్లారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్లకు అనేక దఫాలుగా వినతి పత్రాలు అందజేశామన్నారు. వేతనాలు ఇవ్వకుంటే ఏప్రిల్ 5వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. సమస్యలపై అధికారులు స్పందించకపోవడంతో సమ్మెలోకి వెళ్తున్నట్లు చెప్పారు. కార్మికులకు బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లిస్తామని ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోవడం లేదన్నారు. బకాయి వేతనాలను అందించేంత వరకు సమ్మె కొనసాగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎర్రిస్వామి, జిల్లా కార్యదర్శి రాము పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్ని విధాలా తోడ్పాటు : కలెక్టర్



ల్యాప్‌టాప్‌లను అందిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్


ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

దివ్యాంగులకు ప్రభుత్వం అందించే అన్ని సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సూచించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు స్వయం ఉపాధి పథకం కింద ఆవులు, గొర్రెలు పెంపకం, జనరల్ స్టోర్, ఫొటో స్టూడియో, బేకరీ తదితర వృత్తులకు జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సహాయ సంస్థ ద్వారా 17 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.30.50 లక్షల విలువగల రుణాలు, డిగ్రీ మరియు ఇతర వత్తి విద్య కోర్సులు అభ్యసిస్తున్న 15 మందికి ల్యాప్‌టాప్‌లు, 13 మంది బదిరులకు టచ్‌ఫోన్‌లను కలెక్టర్ అందజేశారు. వీటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు వినోద్ పాల్గొన్నారు.

భూసేకరణ ఆపాలని నిరసన

ప్రజాశక్తి-మడకశిర

పరిశ్రమలు, సోలార్ పేరుతో చేపట్టిన భూసేకరణ ప్రక్రియను తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కరుణాకర్‌కు వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హరి, జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ పరిశ్రమలు, సోలార్ కోసం మండలం లో భూములు సేకరిస్తున్నట్లు తెలిసిందన్నారు. గతంలో సి.కొడిగేపల్లి, నల్లయనపల్లి, కేతేపల్లి, కల్లుమర్రి, అగరంపల్లి, జంగాలపల్లి, పరిగి మండలంలోని పలు గ్రామాల్లో 2004-05లో సుమారు 2,600 ఎకరాలను పరిశ్రమల పేరుతో రసాయి కంపెనీకి చౌకగా కట్టబెట్టారన్నారు. భూమిలిచ్చిన ప్రతి రైతు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని మోసం చేశారన్నారు. జమ్మానిపల్లి, తురకవాండ్లపల్లి, గౌడన హళ్లి గ్రామాల్లో కూడా ఎపిఐఐసి ఆధ్వర్యంలో 1600 ఎకరాలు సేకరించారే కానీ నేటికీ పరిశ్రమలు ఏర్పాటు చేయలేదన్నారు. ఇప్పుడు కొత్తగా వేల ఎకరాల భూమిని సేకరించి 4 వేల మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పడం దుర్మార్గమన్నారు. 20 ఏళ్ల క్రితం తీసుకున్న భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు కావున రైతుల భూములను తిరిగి వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టు రైతు సంఘం అధ్యక్షుడు సోమకుమార్, సిఆర్.రెడ్డి, రైతులు హనుమంతరాయప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

10 వేల రూఫ్‌టాప్ యూనిట్ల ఏర్పాటే లక్ష్యం

కలెక్టర్ టిఎస్.చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పిఎం సూర్య ఘర్ పథకం కింద జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 10 వేల రూఫుటాప్ యూనిట్లు ఏర్పాటు చేసే లక్ష్యంగా సంబంధిత అధికారులు ప్రణాళికతో ముందుకెళ్లాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో రూఫ్‌టాప్ యూనిట్లు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులపై జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం రూ.60 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.55 వేలు సబ్సిడీగా అందిస్తోందన్నారు. వందశాతం ఉచిత సబ్సిడీ అందుతున్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. గృహ అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అందిస్తే రూ.2.90 చొప్పును ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఇక జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలూ తీసుకోవాలన్నారు. నియోజకవర్గ విజన్ ప్రణాళికలో భూగర్భ జలాలు, వ్యవసాయం, ఉద్యానవన వివరాలు జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. పారిశుధ్యం, నీటి కాలుష్యం, పైపు లైన్లు తనిఖీ చేస్తూ ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద మినీ గోకులంలో ఫారంపాండ్స్ పశువులకు నీటితొట్లెల నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు సువర్ణ, మహేష్, ఆనంద్, శర్మ, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి, డిపిఒ సమత, డిఎంహెచ్ఒ ఫిరోజ్ బేగం, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్సీ సురేంద్రనాథ్, సిపిఒ విజయ్ కుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

త్వరలో గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటు : మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ, రొద్దం పరిసర ప్రాంతాల మహిళలకు ఉపాధి కల్పించేందుకు త్వరలోనే గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని, అందుకోసం స్థల పరిశీలన కూడా జరుగుతోందని మంత్రి సవిత తెలిపారు. మంత్రి శుక్రవారం మండలంలోని నాగులూరు గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. 'జలజీవన్ మిషన్'లో భాగంగా నూతన బోరు వేయటానికి పూజ చేశారు. రూ. 1.05 కోట్ల వ్యయంతో పూర్తి చేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. మంత్రి మాట్లా డుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్, పిఆర్ డిఈ వెంకటరమణ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, నాయకులు నారాయణ స్వామి, వెంకటరాముడు, టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములుయాదవ్, మండల కన్వీనర్ సిద్దయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, వెంకటగిరిపాల్యం శ్రీనివాసులు, త్రివేంద్రనాయక్, ప్రసాద్, గోపాల్, సూర్యనారాయణ, రామకృష్ణ, హనుమంతుయాదవ్ పాల్గొన్నారు.

మంత్రితో ఎపిఐఐసి ఛైర్మన్ భేటీ

మంత్రి సవితను పట్టణంలోని ఆమె నివాసంలో ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. వారు ఎపిఐఐసికి సంబంధించి పలు విషయాలపై చర్చించారు. పరిశ్రమలకు అవసరమైన భూములను గుర్తించి పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలని మంత్రి ఆయనకు సూచించారు. అనంతరం మంత్రి ఎపిఐఐసి ఛైర్మన్‌ను శాలువా కప్పి సన్మానిం చారు. వారితో నాయకులు వెంకటేశ్వరరావు, ఎపిఐఐసి అధికారులు, పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువ లైనింగ్ వద్దు.. వెడల్పు చేయాలని వినతి

'హంద్రీనీవా కాలువ లైనింగ్ వద్దు.. వెడల్పు చేయాలి' అని కోరుతూ ఎపి రైతు సంఘం ఆధ్వ ర్యంలో మంత్రి సవితకు వినతి పత్రం ఇచ్చారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ రైతులకు నష్టం కలిగించే 404, 405 జీవోలను రద్దు చేయాలన్నారు. హంద్రీనీవా కాలువ కింద రైతులు బోర్లు వేసుకుని పంటలు చేస్తున్నారని, లైనింగ్ పనులు చేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతాయన్నారు. తద్వారా నీరందక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతారన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ పనులను వెంటనే పూర్తి చేయాలని, హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని 10వేల క్యూసెక్కులకు పెంచి పిల్ల కాలువల ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లా లోని అన్ని చెరువులను నీటితో నింపాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగాధర్, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఫకృద్దీన్, లక్ష్మీనరసప్ప ఉన్నారు.



నాగులూరులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సవిత

అభివృద్ధి పనులకు భూమిపూజ

రొద్దం : పెన్నా నదిలో నీరు పారితే రొద్దం నుంచి చిన్నకోడిపల్లి, కళ్లకుంట నుంచి నల్లూరు, చిన్నమంతూరు నుంచి దందేపల్లి గ్రామాలకు వెళ్లాలంటే మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కిలోమీటర్ల దూరం తిరిగి ఆయా గ్రామాలకు వెళ్లాల్సి ఉండేది. దీంతో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం మంత్రి సవిత నల్లూరు వద్ద పెన్నా నదిలో రూ. 2.8 కోట్ల వ్యయంతో పెన్నా నదిలో కాజ్‌వే నిర్మాణానికి భూమిపూజ చేశారు. కల్లకుంట గ్రామ ఎంపిపి పాఠశాలను సందర్శించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. దొడగట్ట, కొట్టాల గ్రామాల మధ్యలో కల్వర్టుతో పాటు ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆర్.మరవపల్లిలో నిర్మిస్తున్న ఎంజెబి పాఠశాలను పరిశీలించారు. కృష్ణా జలాల చేరికతో తురకలాపట్నం చెరువు మరువ పారుతున్నందున జలహారతి ఇచ్చారు. మంత్రి వెంట తహశీల్దార్ ఉదయశంకర్‌రాజ్, ఎంపిడిఒ రామ్‌కుమార్, ఎంజెబి పాఠశాల ప్రిన్సిపల్ అనిత, టిడిపి మండల కన్వీనర్ నరహరి, మాధవనాయుడు, వెంకట్రామిరెడ్డి, చిన్నప్పయ్య, కంబాలపల్లి సర్పంచి మంజు ఉన్నారు.

రేపు రాతిదూలం లాగుడు పోటీలు

గోరంట్ల : శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఆదివారం పట్టణంలో వెలసిన మరువ ఆంజనేయస్వామి ఆలయం వద్ద రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నిమ్మల శ్రీధర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పోటీలను వీక్షించేందుకు మంత్రి సవిత హాజరవుతారన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ. 25వేలు, రూ. 15వేలు, రూ. 10వేలు అందజేస్తామన్నారు. హాజరైన వారందరికీ అన్నదానం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

మడకశిర : ఎండ తీవ్రత దృష్ట్యా శుక్రవారం మండలంలోని జమ్మిమానిపల్లి ఎంపిపి పాఠశాలలో ఎస్ఎంసి ఛైర్మన్ నారాయణ, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మురళిబాబు విద్యార్థులకు చల్లటి మజ్జిగ, పుచ్చకాయల ముక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు కంప్యూటర్లు వితరణ

గోరంట్ల : పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలికల గురుకుల పాఠశాలకు శుక్రవారం ఐడిబిఐ బ్యాంకు మేనే జర్ 4 కంప్యూటర్లు అందజేసినట్లు ప్రిన్సిపల్ విజయ్ కుమార్ తెలిపారు. అనంతరం పాఠశాలలో ఏర్పా టు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఐడిబిఐ మేనేజర్ జయప్రకాష్, డిటిడబ్ల్యుఒ మోహన్‌రావు ప్రారంభిం చారు. పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థినులు కంప్యూటర్ పరిజ్ఞానం సాధిస్తారని ప్రిన్సిపల్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.



పాఠశాలలో ప్రారంభించిన కంప్యూటర్ ల్యాబ్

భూ అక్రమాలపై అధికారుల స్పందన

ముదిగుబ్బ ఎంపిపికి నోటీసులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రూరల్ మండలంలో అసైన్డ్ భూముల అక్రమాలపై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. రూ. కోట్లు విలువజేసే ప్రభుత్వ భూమిని బిజెపి నాయకుడు, ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణయాదవ్ స్వాధీనం చేసుకోవడంపై సిపిఎం నాయకులు మార్చి 24వ తేదీ ఆధారాలతో సహా కలెక్టర్, జిల్లా రెవెన్యూ, డివిజన్ అధికారులు, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ముదిగుబ్బ ఎంపిపి జి.ఆదినారాయణయాదవ్ అనంతపురం రూరల్ పరిధిలోని అసైన్డ్ భూమిని కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు గుర్తించిన అధికారులు ఆయనతో పాటు బినామీ శివశంకర్‌రెడ్డితో సహా పలువురికి నోటీసులు అందజేశారు. నిబంధనల ఉల్లంఘన నేపథ్యంలో రూ. కోట్ల విలువజేసే దాదాపు పదెకరాల ప్రభుత్వ భూమికి సంబంధించి ఇటీవల మీడియాలో కథనాలు వచ్చాయి. స్పందించిన జిల్లా అధికారులు ఇటీవల అధికారికంగా సర్వే చేసి, ప్రాథమికంగా ప్రభుత్వ భూమిగా గుర్తించారు. ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ యాదవ్, అతని బినామీలు 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసులు పంపారు. గడువు ముగిసిన తర్వాత సదరు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో పాటు అక్రమ నిర్మాణాలను తొలగించి చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా ఉపేక్షించేది లేదని జిల్లా రెవెన్యూ అధికారి హెచ్చరించారు. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని సిపిఎం నాయకులు కోరారు.

'సంఘం శరణం గచ్ఛామి' పోస్టర్ ఆవిష్కరణ

సోమందేపల్లి : స్థానిక జగ్జీవన్‌రామ్‌నగర్‌లో మే 2వ తేదీ నిర్వహించే 'సంఘం శరణం గచ్ఛామి' అంబేద్కర్ నాటక ప్రదర్శనను జయప్రదం చేయాలని కెవిపిఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం సోమందేపల్లిలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు హను మయ్య మాట్లాడుతూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో సంఘం, శరణం, గచ్ఛామి పేరుతో అంబేద్కర్ జీవిత కథను తెలిపే నాటికను మే 2వ తేదీ సంత మార్కెట్ రోడ్డులో ప్రదర్శిస్తామన్నారు. కార్యక్రమంలో జికె.ప్రకాష్, నాగరాజు, రవి, నరసింహులు, కెవి.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి విరాళం

లేపాక్షి : లేపాక్షిలో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణం కోసం శుక్రవారం ఎంఇఒ నాగరాజు రూ. 10,116, కుళ్లాయప్ప రూ. 1000, లేపాక్షి మండల ఉపాధ్యాయ బృందం తరపున రూ. 58వేలు విరాళం అందజేశారు. మొత్తంగా మండల విద్యాశాఖ తరపున రూ. 69,116ను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

నేడు బాబుజగ్జీవన్ రామ్ జయంతి

మడకశిర : పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో శనివారం వైసిపి ఆధ్వర్యంలో బాబుజగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి తెలిపారు. ముఖ్యఅతిథిగా నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప హాజరవుతారని, కావున పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

10న సంత వేలం పాట

ప్రజాశక్తి నల్లచెరువు

నల్లచెరువు పంచాయతీ వారపు సంత వేలం పాటను ఈనెల 10న నిర్వహిస్తున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. ఆసక్తి గలవారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

రైతులు తమ పొలాలకు సేంద్రియ ఎరువులు వాడితేనే అధిక దిగుబడులు పొందవచ్చునని వ్యవసాయ అధికారి ఎం నటరాజు, ఎఫ్ పి ఓ, క్యెఎంఎస్ మేనేజర్ తెలిపారు. మండల పరిధిలోని మీర్జాపురం గ్రామంలో ఐఎన్‌డి గ్యాప్ పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పరస్పర సహాయ సహకార సంఘం పరిమితం ద్వారా ఏపీఎస్‌ఒ డిసిఎ సంస్థకు నమోదు చేసుకోబడిన పెనుగొండ వ్యవసాయ డివిజనకు సంబంధించి 30 మంది రైతుల పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రతాపరెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ ఎం అశ్విని, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం మండలం కునుతూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బాబావలి తన నిజాయితీని నిరూపించుకున్నాడు. శుక్రవారం తన ఆటోలో ప్రయాణించిన వ్యక్తి ఫోన్‌ను ఆటోలోనే పడేసుకున్నాడు. అది గుర్తించిన ఆటో డ్రైవర్ ఆ ఫోన్‌ను ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్లో అప్పగించాడు. ఆ ఫోన్ ధర్మవరం ఎండోమెంట్ కార్యాలయ అధికారిదిగా గుర్తించిన పోలీసులు ఆయనకు అందజేశారు. నిజాయితీగా మొబైల్ ఫోన్ ను స్టేషన్లో ఇచ్చినందుకు ఆటో డ్రైవర్ బాబావలిని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు అభినందించారు.

6 నుంచి యోగి వేమన బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని కటారుపల్లిలో ఈనెల 6 నుంచి యోగి వేమన బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పాలయ పీఠాధిపతి నంద వేమారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 6, 7, 8 తేదీల్లో మూడు రోజులు పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ బ్రహ్మోత్సవాలకు నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాలతో పాటు కర్నాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో రానున్నారన్నారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే వారికి కనీస సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు కదిరి డీఎస్పీ శివన్నారాయణ స్వామి ఆధ్వర్యంలో రూరల్ సిఐ నాగేంద్ర, ఇన్‌ఛార్జి ఎస్ఐ వలిబాషా పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని 380 మంది రోగులకు, సహాయకులకు భోజనపు ప్యాకెట్లను, వాటర్ ప్యాకెట్లను వైద్యు లు, సిస్టర్ల చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి సేవా సమితి కన్వీనర్ నామా ప్రసాద్ మాట్లాడుతూ ఈ అన్నదాన సేవా కార్యక్రమం దాసరి తులసమ్మ, వెంకటస్వామిల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు దాతలుగా వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, 27 మంది సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

బోరుబావి తవ్వకం

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

ముస్లిం మైనార్టీ సోదరులకు రంజాన్ పండుగ సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం ఈద్గా మైదానంలో విజ్ఞాన్ కళాశాలల చైర్మన్ ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో తాగునీటి కోసం శుక్రవారం బోరుబావిని తవ్వించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ సోదరులు, నాయకులు తదితరులు ఫక్రుద్దీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాజీ సాదిక్ వలి, మాజీ వక్ఫ్ బోర్డ్ మెంబర్ జౌలి బాబా, , ముస్లిం మైనారిటీ టిడిపి నాయకుడు తుమ్మల మహబూబ్ బాషా,, దావు భాయ్ అబ్దుల్ హుస్సేన్ , మసీదు ముతవల్లి అల్లా బకాష్ తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకనం ప్రారంభం

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల మూల్యాంకనం ప్రారంభమయ్యింది. రెండు రోజులుగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. డిఈవో క్రిష్టప్ప మూల్యాంకన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. జిల్లాలోని ఉపాధ్యాయులు జవాబు పత్రాలను దిద్దుతున్నారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ లాజర్, ఏడీ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొట్లూరులో పరుగుపందెం పోటీలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మండల పరిధిలోని గొట్లూరు గ్రామంలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని ఈనెల 6న పరుగు పందెం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్స్ బాలరాజు, సాయికుమార్ తెలిపారు. 2 కిలోమీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.ఉమ్మడి జిల్లాలోని ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనవచ్చునని తెలిపారు. ఇందులో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.5,016, రెండవ బహుమతి రూ.3016, మూడవ బహుమతి రూ.2,016, నాలుగవ బహుమతి రూ.1,016 నగదుగా బహుకరించబడునని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు సెల్ నెంబర్ 970 3832 051, 6301112051కు గాని సంప్రదించాలని నిర్వాహకులు సాయికుమార్, బాలరాజు తెలిపారు.

అర్ధాకలితో 'ఎంజిఎం' విద్యార్థులు

◆ముందొస్తేనే కోడిగుడ్డు
◆విద్యార్థుల పొట్ట కొట్టి సొమ్ము చేసుకుంటున్న హెచ్ఎం



అన్నం లేని పాత్ర వద్ద అన్నం కోసం నిలబడిన విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

ఆ పాఠశాలకు ఎంతో చరిత్ర ఉంది.స్వాతంత్ర ఉద్యమ చరిత్ర కలిగిన మహాత్మా గాంధీ పేరుతో ఉన్న ఉన్నత పాఠశాలలో నేడు ఆ పాఠశాల హెచ్ఎం నిర్లక్ష్యం, స్వార్థం వల్ల విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు.

పట్టణంలోని ఎంజిఎం పాఠశాలలో 648 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికి ప్రభుత్వ మార్గదర్శకల మేరకు ప్రతి రోజు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాల్సిన బాధ్యత పాఠశాల హెచ్ఎంపై ఉంది. అయితే హెచ్ఎం నిర్లక్ష్యం వల్ల విద్యార్థులకు శుక్రవారం ఒక గంట ఆలస్యంగా మధ్యాహ్నభోజనాన్ని అందజేశారు. విద్యార్థులు ఉదయం లేచి కాలకృత్యాలు పూర్తి చేసుకుని, నీరుతాగి పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఇస్తారన్న నమ్మకంతో ఉదయం 7.45 గంటలకు పాఠశాల వచ్చారు. 10:30 గంటలకు భోజనం ఇవ్వాల్సి ఉంటే 11:40 గంటలైన భోజనం అందించ లేదు. దీంతో విద్యార్థులు ఆకాలితో అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు అక్కడికి వెళ్లారు. మధ్యాహ్న భోజనం వండే వ్యక్తితో ఎందుకు ఇంత ఆలస్యంగా విద్యార్థులకు అన్నం పెడుతున్నారని అడిగితే హెచ్ఎం తమకు బియ్యం ఆలస్యంగా అందించారని, దీంతో వండటం ఆలస్యం అయిందని సమాధానమిచ్చాడు. 50 కేజీల బియ్యం ఇచ్చి మూడు రోజులు చేయాలని ఆదేశాలు ఇస్తున్నారు. అందరికి ఎలా అన్నం వడ్డించాలో అర్థం కావడం లేదని ఆయన అన్నాడు. పాఠశాల లెక్కల ప్రకారం 648 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో పదవ తరగతి విద్యార్థులు 180 మంది పరీక్షలు రాసి వెళ్ళిపోయారు. మిగిలిన 480 మందిలోనూ ఇంకా 180 మంది రాలేదనుకున్నా 300 మంది ఉంటారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఒక విద్యార్థి 150 గ్రాముల చొప్పున అన్నం ఇవ్వాల్సి ఉంది. ఈ లెక్కన 37.50 కేజీల బియ్యాన్ని వండాల్సి ఉంది. అయితే శుక్రవారం 20 కేజీల బియ్యంతో అన్నం చేశారు. దీని ప్రకారం 160 మంది విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజనం సిద్ధం చేశారు. పౌష్టిక ఆహారం ఇవ్వాలని ప్రభుత్వం ప్రత్యేక మెనూ సిద్ధం చేసి అన్నంతో పాటు కోడి గుడ్డు, చెక్కీలతో పాటు రాగి జావ ఇవ్వాల్సి ఉంది. వీటిని సైతం పూర్తిగా ఇవ్వడం లేదు. కనీసం 300 మంది విద్యార్థులకు 10 క్రేట్ల కోడి గుడ్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం 5 నుంచి 6 క్రేట్లే ఇస్తున్నట్లు వంట వండే వారు చెబుతున్నారు. దీనిని బట్టీ ఎవరు ముందు వస్తే వారికి గుడ్డు అందుతుందన్న మాట. ప్రభుత్వం నుంచి ఇండెంట్ ప్రకారం బియ్యం, గుడ్లు అందుతున్నా విద్యార్థులకు అందించడంలో చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు బహిర్గతమవుతోంది. ప్రతి నెల పనిదినాలు 24 రోజులు లెక్క వేసుకున్నా నెలకు దాదాపు 20 పాకెట్ల బియ్యం వినియోగించాలి. అయితే ఇక్కడ 8 పాకెట్ల బియ్యం మాత్రమే వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. మిగిలిన బియ్యం ఎవరు తీసుకెళుతున్నారన్నది అర్థం కావడం లేదు. ఈ విషయంపై హెచ్ఎం సామ్రాజ్యంను సంప్రదిస్తే జిల్లా ఉప విద్యాధికారి మధ్యాహ్నం 12 గంటలకు భోజనం ఇవ్వాలని చెప్పినట్లు చెబుతున్నారు. ఒక విద్యార్థికి ఎన్ని గ్రాములు ఇవ్వాలని అడిగితే చెప్పలేదు. ఏది ఏమైనప్పటికి ఎంతో ఘన చరిత్ర కలిగిన ఎంజిఎం పాఠశాలలో విద్యార్థులు మాత్రం అర్ధాకాలితో అలమటిస్తురన్నది ఇది చూసిన ప్రతి ఒక్కరికి అర్థం అవుతుంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఈ పాఠశాలపై ప్రత్యేక చొరవ తీసుకుని ప్రతి విద్యార్థికి నాణ్యమైన భోజనం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరుతున్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరిస్తున్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

నేడు రోడ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన



బిటి రోడ్డు పనులు ప్రారంభించనున్న రోడ్డు

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని గ్రామీణ రోడ్లను మహర్దశ పట్టనుంది. గత కొన్ని ఏళ్లుగా రోడ్డు నిర్మాణానికి నోచుకోక ఇటు గ్రామస్తులు అటు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్న వేళ బీసీ సంక్షేమ చేనేత శాఖ మంత్రి సవిత చొరవతో గ్రామీణ రోడ్లకు మహర్దశ సంతరించుకుంది. పరిగి మండలంలోని కర్నాటక సరిహద్దు ప్రాంతాలైన మూడిండ్లపల్లి, ఎన్ ముదిరెడ్డిపల్లి, నరసాపురం గ్రామాలకు రోడ్డు సదుపాయం లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడ్డారు. ఈ రోడ్డు సమస్యను గత ఎన్నికల్లో సవిత దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లగా కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు నిర్మాణం చేపడతామని ఆమె అప్పట్లో హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు కోటి రూపాయలు మంజూరు చేయించి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీంతో పనులు పూర్తి అవ్వడంతో మండల పర్యటనకు వచ్చిన మంత్రి సవిత శనివారం ఈరోడ్డును ప్రారంభించనున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తి అవ్వడంతో ఏడు గ్రామాల ప్రజలకు రహదారి సమస్య తీరిన్నట్లైంది.

రూ. 2 కోట్లతో విట్టపల్లి- తిరుమదేవరాయపల్లి గ్రామాల రోడ్డుకు శంకుస్థాపన

దాదాపు పంచాయతీలు ఏర్పడినప్పటి నుంచి 30 సంవత్సరాల నుండి రహదారులు లేక వర్షాకాలంలో తిరుమదేవరాయపల్లి నుండి విట్టపల్లికి వెళ్లే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతుండే వారు. ప్రస్తుతం ఈ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి సవిత శనివారం భూమిపూజ చేయనున్నారు. రహదారి నిర్మాణం చేపడితే ఇటు వ్యవసాయానికి అనుకూలంగా రైతులకు గాని ప్రజలకు గాని మేలు చేకూరనుంది.కోటి రూపాయలు నిధులు వెచ్చించి ఈ రహదారి నిర్మించడం ఎంత హర్షించదగ్గ విషయమని వారు వ్యాఖ్యానిస్తున్నారు. రహదారి నిర్మాణానికి నిధులు తీసుకురావడంలో మంత్రి సవిత విజయవంతమై ఎన్నికల నాటి వాగ్దానం నెరవేర్చుతున్నారని నాయకులు చెబుతున్నారు.

ఊటకూరు - అక్కంపల్లి రహదారి నిర్మాణానికి భూమి పూజ

పరిగి మండలంలోని ఉటకూరు పంచాయతీ పరిధిలో ఉన్న మారుమూల గ్రామంలో అక్కంపల్లి గ్రామం ఒకటి. అయితే కొద్దిపాటి చీకటి పడితే ఈ గ్రామానికి వెళ్లాలంటే ఇటు గ్రామస్తులతో పాటు అధికారులకు భయమే. ఎన్నో ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా ఈ గ్రామానికి రహదారి సమస్యను తీర్చలేదు. హామీ ఇస్తున్నారే తప్ప అమలుకు నోచుకోని ఏకైక రహదారి అక్కంపల్లి గ్రామం రోడ్డు నిర్మాణం. అయితే కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రి సవిత తాను ఇచ్చిన హామీ మేరకు కోటి రూపాయల నిధులతో పనులు చేపట్టనున్నారు. మారుమూల గ్రామాన్ని గుర్తించి తమ గ్రామానికి రహదారి ఏర్పాటుకు నిధులు వెచ్చించి శనివారం రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి సవితకు గ్రామస్తులు కృతజ్ఞతలు చెబుతున్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా సౌకర్యాలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యార్థులకు సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, అకాడమిక్ డైరెక్టర్ నందిత పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో ప్రీ ప్రైమరీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగాప్రీ ప్రైమరీ విద్యార్థులకు పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, అకాడమిక్ డైరెక్టర్ నందిత, కరస్పాండెంట్ నంద కుమార్ మార్కుల మెమోతో పాటు పట్టా అందించారు.



చిన్నారులతో పాంచజన్య శ్రీనివాసులు, తదితరులు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే పాఠశాలలో రాష్ట్ర, జాతీయ స్థాయికి అనుగుణంగా ప్రమాణాలను ఏర్పాటు చేసి ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, ఉన్నత పాఠశాల విద్యార్థులకు తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అంతర్జాతీయ స్థాయికి అనుగుణంగా పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. దీని కోసం కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులో అంతర్జాతీయ గుర్తింపు పొందిన వివిధ పాఠశాలలను పరిశీలన చేసి ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాల కన్నా ఇంకా మెరుగైన సౌకర్యాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులు ప్లాస్టిక్ నిషేదంపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గాయత్రి, ఎఒ భాస్కర్, పాఠశాల సూపరింటెండెంట్ విజయంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, అబ్దుల్ రజాక్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలను ప్రేరేపిస్తున్న జగన్ : కందికుంట

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్రంలో హత్యా రాజకీయాలను మాజీ ముఖ్యమంత్రి జగన్ పేరేపిస్తున్నారని స్వలాభం కోసం వ్యక్తిగత హత్యలకు రాజకీయరంగు పులుముతున్నారని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని రోడ్లు భవనాలు అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాప్తాడు నియోజవర్గంలో కురుబ లింగమయ్య వ్యక్తిగత కక్ష హత్యను రాజకీయ హత్యగా చిత్రీకరిస్తూ కుల మతాలకు ఆపాదిస్తున్నారని విమర్శించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట

సభ్యసమాజం తలదించుకునేలా జగన్ వ్యవహరిస్తున్నారని అన్నారు. సత్యసాయి జిల్లాకు వచ్చే ముందు సొంత బాబాయ్ హత్యపై మాట్లాడాలన్నారు గతంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రశ్నించిన వారిని దారుణంగా హత్యచేశారని ఆరోపించారు. తన తండ్రి హత్య కేసులో నిందితులకు శిక్ష పడాలని వైయస్ సునీత 20 పేజీల ఉత్తరం ఎమ్మెల్యేలకు రాసిందని తెలిపారు. సొంత చెల్లికి న్యాయం చేసి తర్వాత సత్యసాయి జిల్లాకు రావాలని వైఎస్ జగన్‌కి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హితవు పలికారు. ఈ సమావేశంలో తెలుగు యువత గంగయ్య నాయుడు, టీడీపీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, టిఎన్ఎస్ఎఫ్ సల్మాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నవమి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



ఎడ్లబండ్ల పోటీల ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఈనెల 6న నిర్వహించే శ్రీరామనవమి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ వి.రత్న సూచించారు. నవమి వేడుకల సందర్భంగా ఆనవాయితీగా నిర్వహించే ఎడ్ల బండ్ల పోటీల నిర్వాహకులు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ సూచించారు. శుక్రవారం గోరంట్ల మండలంలోని కరావుల పల్లి తండా సమీపంలోని రామాలయం వద్ద నిర్వహించే ఎడ్లబండ్ల పోటీల ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వి.రత్న, పెనుగొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, రెవిన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ వేడుకలకు మహారాష్ట్ర మంత్రి సంజయ్ రాథోడ్ హాజరవుతుండడంతో, పర్యటన సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎడ్లబండ్ల పోటీలు జరిగే ప్రాంతంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగు ఏర్పాట్లు చేసుకోవాలని నిర్వాహకులకు ఎస్పీ సూచించారు. జిల్లావ్యాప్తంగా ఇటువంటి పోటీలు నిర్వహించే నిర్వాహకులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శ్రీరామనవమి వేడుకల సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమలో డీఎస్పీలు వెంకటేశ్వర్లు ,శ్రీనివాసులు, గోరంట్ల తహశీల్దార్‌తోపాటు ఎస్‌బి సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, గోరంట్ల సిఐ శేఖర్,కమిటీ సభ్యులు జెడ్పీటీసీ జయరామానాయక్, జీ వీ రమణారెడ్డి ,పెడపల్లి తిరుపాల్ నాయక్ ,రామస్వామి నాయక్, ఉన్నారు.

ముదిగుబ్బ : శ్రీరామనవమి సందర్భ:గా మండల కేంద్రంలోని పాత ఊర్లో ఆదివారం సీతారాముల కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నటుల నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

హిందూపురం :హిందూపురం పట్టణంలోని సూగూరు ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం నుండి శ్రీరామనవమి ఉత్సవాలను ప్రారంభిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి నరసింహరాజు, అర్చకులు రాఘవేంద్రరావు, కృష్ణాచారి, వెంకోబారావు తెలిపారు. శనివారం అభిషేకాలు, ప్రాకారోత్సవం, ఆకు పూజ వంటి పూజాది కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అదేవిధంగా 6వ తేదీ శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం కళ్యాణోత్సవం, మధ్యాహ్నం రథోత్సవం, సాయంత్రం ఉట్ల పరుష, రాత్రి లంక దహనం వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అలాగే 7వ తేదీ సీతారాముల పట్టాభిషేకం, నిజ అశ్వవాహనం, నగరోత్సవం వంటి పూజలు జరుగుతాయన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.



వర్షానికి నల్లగా మారిన వేరుశగన

వర్షానికి తడిసిన వేరుశనగ

ప్రజాశక్తి - తాడిమర్రి

గురువారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని పలువురు రైతులకు చెందిన పంటలు తడిచిపోయాయి. మండల పరిధిలోని చిల్ల కొండయ్య పల్లి గ్రామంలో పూలకుంట ప్రసాద్ అనే రైతు మూడు ఎకరాల విస్తీర్ణంలో సాగుచేసినటువంటి వేరుశనగ పంట తడిసి ముద్దయింది. దీంతో తనకు దాదాపుగా రెండు లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

కరాటే శిక్షణలో నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించండి

ప్రజాశక్తి - బుక్కపట్నం

సత్యసాయి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్ కోసం ప్రభుత్వం కరాటే శిక్షణ కోసం నిధులు కేటాయించిందని ఆ నిధులు దుర్వినియోగం అయ్యాయని దీనిపై విచారణ చేపట్టాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఇండియా సెక్రటరీ భాస్కర్ నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సర్వ శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ దేవరాజ్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే శిక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం సర్వ శిక్షణ అభియాన్ ఆధ్వర్యంలో కరాటే శిక్షకులను ఏర్పాటుచేసి విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. శిక్షకులు ఏర్పాటు చేయకనే నిధులు గోల్‌మాల్ చేస్తున్నారని, కనీసం సర్వ శిక్ష అభియాన్ సంస్థ పక్కన ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కూడా శిక్షకులు లేకుండానే నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. నాలుగు సంవత్సరాలుగా జిల్లావ్యాప్తంగా శిక్షణ ఇవ్వకుండానే శిక్షణ ఇస్తున్నట్లు సృష్టించి నిధులు మంజూరు చేసుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు కలుగజేసుకొని నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

పోక్సో కేసులో నిందితుడికి యావజ్జీవశిక్ష

ప్రజాశక్తి-పావగడ

పోక్సో కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష, రూ. 1.5 లక్షల జరిమానా విధిస్తూ తుముకూరు ప్రత్యేక కోర్టు తీర్పు ఇచ్చింది. వివరాలు.. తాలూకాలోని లింగదహళ్లి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక గతేడాది సంక్రాంతి పండుగ రోజున ఇంటి ముందు ముగ్గులు వేయడానికి రంగులు తీసుకొచ్చేందుకు లింగదహళ్లికి బయల్దేరింది. మార్గమధ్యలో శ్రీరామ్ అనే యువకుడు బాలికకు మాయ మాటలు చెప్పి తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని సమీపంలోనే పొదల చాటుకు తీసుకెళ్లి అత్యాచా రానికి పాల్పడ్డాడు. బాలిక ద్వారా ఈ విషయం తెలుసుకున్న బంధువులు అరసికెరె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు శ్రీరామ్‌ను అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేశారు. రూరల్ సిఐ గిరీష్ దర్యాప్తు చేసి కోర్టుకు వివరాలు అందించారు. బాలిక తరఫున ప్రభుత్వ న్యాయవాది హనుమంతరాయ తలికేరి వాదించారు. పూర్వాపరాలను పరిశీలించిన తుముకూరు ప్రత్యేక కోర్టు బాలికకు జిల్లా న్యాయ సేవ ప్రాధికార సమితి నుంచి రూ. 8 లక్షలు పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. అలాగే నిందితుడు శ్రీరామ్‌కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 1.5లక్షల జరిమానా విధించింది.

వరకట్న వేధింపులపై కేసు

ప్రజాశక్తి - కదిరి టౌన్

వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు.కదిరి పట్టణం, ఓల్డ్ మేదర వీదిలో నివాసము ఉండే షేక్ రుహినాజ్ అనే యువతికి సంవత్సరం క్రితం బెంగళూరు కి చెందిన మెకానిక్ షేక్ మహమ్మద్ వసీం అక్రంతో వివాహమైందన్నారు. వారికి ఒక కొడుకు సంతానం అని చెప్పారు. పెళ్లి సమయములో షేక్‌మహ్మద్‌కు 9 తులాలు బంగారు ఆభరణాలు కట్నంగా ఇచ్చామని పెళ్లి అయిన ఒక నెలకు ఆడపడుచు తసీన్, మరియు ఆమె భర్త జాఫర్ బాషా తనను అదనపు కట్నంగా డబ్బులు ఇవ్వమని తనని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని బాధితురాలు షేక్ రుహినాజ్ ఫిర్యాదు చేసినట్లు సిఐ వివరించారు. ఆమె ఫిర్యాదు మేరకు కదిరి టౌన్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నిందితులకు రెండేళ్ల జైలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండలంలోని నారేపల్లి గ్రామంలో 2015 వ సంవత్సరం అక్టోబర్ నెల 15,న జరిగిన ఘర్షణ కేసులో కోర్టు తీర్పు శుక్రవారం వెలువడింది. నిందితులకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పును వెలువరించారు. 15న జరిగిన ఘర్షణలో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను కోర్టుకు హాజరురుపరిచారు. ఇరువర్గాలు చేసుకున్న ఫిర్యాలు మేరకు మొదటి కేసులో 15 మంది సాక్షులను, రెండో కేసులో 8 మంది సాక్షులను పెనుగొండ అసిస్టెంట్ సెక్షన్ కోర్టు జడ్జ్ వాసుదేవన్ విచారించారు. ఈ సందర్భంగా నిందితులకు 2 సంవత్సరాలు శిక్ష, పదివేల రూపాయల జరిమానా విధించారని కొత్తచెరువు ఇన్‌ఛార్జి సిఐ సురేష్ తెలిపారు.

యువతిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

ప్రజాశక్తి - బత్తలపల్లి

తల్లిదండ్రులు తనకు పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారన్న కారణంతో ఇంటి నుండి వెళ్లిపోయిన యువతిని గుర్తించి తీసుకువచ్చిన పోలీసులు శుక్రవారం యువతి తల్లిదండ్రులకు అప్పజెప్పారు. మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన యువతి గత నెల 22న ఇంటి నుండి వెళ్లిపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు యువతి ఆచూకీ కనుగొని ఆమెను తల్లిదండ్రులకు అప్పగించినట్లు బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

తాలూకా అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పావగడ

తాలూకాలోని నాగలమడక గ్రామంలో వెలసిన శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు త్వరలోనే పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే హెచ్‌వి.వెంకటేష్ తెలిపారు. నాగలమడక, హోబలి, తిమ్మమ్మనహళ్లి గ్రామాల్లో కోరమాండల్ కింగ్ ఫర్టిలైజర్స్ వారు నిర్మించిన శుద్ధజల నీటి కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలోనే నాగల మడక శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని తెలిపాశారు. తాలూకాను అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉన్నామన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా బైపాస్ రహదారి, డిప్లొమా, ఐటిఐ కళాశాలలు, నూతన ఆర్టీసీ బస్టాండ్, తదితర నిర్మాణ పనులు చేపడతా మన్నారు. సిఎం సిద్ధరామయ్య మంజూరు చేసిన నిధులతో తాలూకా ప్రజలకు ఫ్లోరోసిస్ రహిత తాగునీరు అందించడానికి పనులు పూర్తి చేశామన్నారు. త్వరలోనే సిఎం సిద్ధరామయ్య ఈ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేస్తారన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ అధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి, విఎస్ఎస్ఎన్ అధ్యక్షుడు పాలనాయిక, ప్రభుత్వ తాలూకా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవికుమార్, కృష్ణప్ప పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ ఛైర్మన్ డిఇ రమేష్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఏర్పాటు చేసిన చలివేంద్రాలను మున్సిపల్ ఛైర్మన్ ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్మన్ డిఈ రమేష్ కుమార్, పట్టుగూళ్ల విక్రయ కేంద్రం వద్ద ఇన్స్ పెక్టర్, మరో చలివేంద్రాన్ని డాక్టర్ వెంకటరమణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సద్గురు యోగి నారాయణ సేవాసమితి అధ్యక్షులు రవిశంకర్, సమితి ప్రతినిధులు రాజ్యలక్ష్మి మోహన్, దుర్గా నవీన్, నిమ్మకాయల రాము, వెంకటరామప్ప, నాగరాజు, మంజు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి మంత్రి పరామర్శ

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని పెద్దిరెడ్డిపల్లికి చెందిన హేమంత్ కుమార్ గురువారం జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి సవిత శుక్రవారం పెద్దిరెడ్డిపల్లికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడొద్దని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు కన్వీనర్ గోవింద్ రెడ్డి, సోమప్ప, పెద్దిరెడ్డిపల్లి ప్రవీణ్ రెడ్డి, తిలక్, మారుతి ప్రసాద్, శాసనకోట వెంకటేష్, నాగభూషణం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శాంతినికేతన్ పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - కొత్తచెరువు

పట్టణంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ పాఠశాల 18వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఆ పాఠశాల ప్రిన్సిపల్ తులసి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను బోధిస్తున్నామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కలిగి ఉండాలని బాగా చదవి పాఠశాలకు గురువులకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డాన్స్ మాస్టర్ వినోద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రత్యామ్నాయం చూపించాలి



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న వేణు గోపాల్ రెడ్డి

మున్సిపల్ అధికారులను అడ్డుకున్న స్థానికులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని నంది సర్కిల్ లో ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు శుక్రవారం తొలగించడానికి సిద్ధమయ్యారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ శోభన్ రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ చంద్రమ్మ, టీపీఎస్ అలివేలమ్మ ఆధ్వర్యంలో యంత్రాలతో పాటు వారి సిబ్బందితో కలిసి ఆక్రమణలు తొలగించడానికి అక్కడికి వెళ్లారు. ఆక్రమణ తొలగింపును అక్కడ ఉన్న వారితో పాటు వ్యవసాయ మార్కెట్ యార్డ్ హమాలీ సంఘం నాయకులు, ఇతర యూనియన్ నాయకులు కలిసి అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న వ్యవసాయ మార్కెట్ యార్డ్ హమాలీ సంఘం గౌరవ అధ్యక్షులు, వైకాపా నాయకులు వేణుగోపాల్ రెడ్డి అక్కడికి చేరుకుని వారికి మద్దతుగా నిలిచారు. ఈ విషయంలో ఆయన మున్సిపల్ అధికారులతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా పేదలు చిన్న చిన్న బంకులను ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. అదేవిధంగా వ్యవసాయ మార్కెట్ యార్డ్ హమాలీ సంఘం వారు తమ కార్యాలయాన్ని, ఇతర సంఘాల వారు వారి కార్యాలయాలను ఏర్పాటు చేసుకున్నారన్నారు. వీటిని ఏర్పాటు చేసుకునే సమయంలో ఏ ఒక్కరు కూడా అడ్డు చెప్పలేదన్నారు. రైల్వే రోడ్డు విస్తరణ పేరుతో భవనాలను తొలగించి సంవత్సరాలు గడుస్తున్న ఇంతవరకు అక్కడ రోడ్డు వేయలేకపోయారనితాజాగా ఎవరికి ఇబ్బంది లేనటువంటి ప్రాంతంలో చిన్న చిన్న వ్యాపారులు బంకులను ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తుంటే ఆక్రమణల పేరుతో తొలగించడం అన్యాయం అని అన్నారు. ఇక్కడ ఉన్న ఆక్రమణలు తొలగించి ఈ స్థలాన్ని ఎవరికి కట్టబెట్టాలని చూస్తున్నారని ఆయన అధికారులను నిలదీశారు. ఈ స్థలం పురపాలక సంఘానికి చెందినదే అయితే తాము స్వచ్ఛందంగా ఇక్కడ ఉన్న బంకులను, యూనియన్ కార్యాలయాలను తొలగించుకుంటామని, అయితే మున్సిపల్ అధికారులు ప్రత్యామ్నాయం చూపించాలని అన్నారు. లేనిపక్షంలో ఇక్కడి నుంచి తాము కదిలే ప్రసక్తే లేదని అధికారులతో వాదించారు. చివరకు ఈ విషయంలో తామే కార్యాలయానికి వచ్చి చర్చిస్తామని చెప్పడంతో మున్సిపల్ అధికార యంత్రాంగం అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ఆయా యూనియన్ నాయకులు, హమాలీలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో నీటి సమస్య

ప్రజాశక్తి - అమడగూరు

మండలంలోని మహమ్మదాబాద్‌లోని ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రం 2లో నెలకొన్న నీటి సమస్యతో సిబ్బంది, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో అంగన్వాడీ కేంద్రానికి నీటి సరఫరా బాగుండేది, అంగన్వాడీ కేంద్రానికి ఏర్పాటు చేసిన పైపు లైన్‌కు లీకేజీలు ఏర్పడి నీటి సరఫరా నిలిచిపోయింది. పంచాయతీ సర్పంచి ఆధ్వర్యంలో మరమ్మతులు చేసినకొద్ది రోజులు మాత్రమే నీరు సరఫరా అయిందని అనంతరం సమస్య మొదటికి వచ్చిందని చెప్పారు. పిల్లల అవసరాలకు నీరు లేకపోవడంతో దూరంలో ఉన్న కుళాయి వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవడం సమయానికి అక్కడ నీరు రాకుండాపోతే అంగన్వాడీ సిబ్బంది పిల్లలను వారి ఇంటి వద్దకు తీసుకెళ్లడం లాంటి ఘటనకు చోటు చేసుకుంటున్నాయి. ఆరు నెలల నుండి నీటి సమస్యతో అంగన్వాడీ సిబ్బంది ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు, ఇప్పటికైన గ్రామ సర్పంచి, పంచాయతీ అధికారులు స్పందించి ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రానికి నీటి సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముస్లిముల మనోభావాలు దెబ్బతీస్తున్న బిజెపి

ప్రజాశక్తి-అనంతపురం

కేంద్రంలో మూడుసార్లు అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ముస్లిముల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని మేయర్ వసీం, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైపుల్లా బేగ్, రిజ్వాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును రాష్ట్రపతి వెన్నక్కి పంపాలని కోరారు. దాదాపు 30 రాష్ట్రాల్లో 10 రాష్ట్రాల్లో బిల్లును వ్యతిరేకించారన్నారు. అయినా లోకసభ, రాజ్యసభలో ఆమోదించడం బాధాకరమన్నారు. వక్ఫ్ ఆస్తిపై కలెక్టర్లకు సర్వాధికారాన్ని ఇవ్వడాన్ని ఒప్పుకునే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. అలాగే వక్ఫ్ బోర్డుల్లో ఇతరులను సభ్యులుగా తీసుకునే సవరణను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ బిల్లుపై రాష్ట్రంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ స్పందించాలని డిమాండ్ చేశారు. రాబోవు రోజుల్లో బిల్లుకు వ్యతిరేకంగా పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి ముస్లిం నాయకులు



కరపత్రాలను విడుదల చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

కంటి వెలుగులు ప్రసాదించడమే లక్ష్యం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పేదలకు కంటి వెలుగులు ప్రసాదించడమే రోటరీ క్లబ్ ప్రధాన లక్ష్యమని ఆక్లబ్ అధ్యక్షులు జయసింహ, కార్యదర్శి నాగభూషణం, కోశాధికారి సుదర్శన్ గుప్తా, క్యాంపు చైర్మన్ పుట్లూరు రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని సాంస్కృతిక మండలిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈనెల 13వ తేదీన నిర్వహించబడే ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరానికి సంబంధించినకరపత్రాలను విడుదల చేశారు. దాసరి నారాయణప్ప జ్ఞాపకార్థం సతీమణి దాసరి బసమ్మ, కోడలు దాసరి లక్ష్మీదేవి, కుమారుడు దాసరి రామచంద్ర దాతృత్వంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ,గ్రామీణ ప్రాంతాలలో గల కంటి సమస్య ఉన్నవారు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర రెడ్డి, సత్రశాల ప్రసన్నకుమార్, కొండయ్య, దాత దాసరి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మామిడి ఎగుమతులపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల పరిధిలోని బుచ్చయ్య గారి పల్లి, కొత్తకోట తదితర గ్రామాలలో మామిడి రైతులకు ఉద్యాన శాఖ అధికారి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో మామిడి పంట ఎగుమతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మామిడి పంటను అధిక సంఖ్యలో భారతదేశం నుంచి అమెరికాకు ఎగుమతులు చేసే ప్రముఖ అగ్రి పార్క్ ఇన్నోవా బయో లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు మామిడి తోటలను సందర్శించి కాయల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ఎగుమతులకు అనువైన కాయలను తమ వద్దకు చేరిస్తే ఎటువంటి కమిషన్ లేకుండా రైతులకు సంతృప్తికరమైన ధరలకు తీసుకుంటామని వారు తెలిపారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, గ్రామ రైతు సేవా కేంద్రం అధికారులు గీత, సుధాకర్, సూరి రైతులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - యాడికి

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును నిరసిస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కరపత్రాలు పంచుతూ శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మోహన, శ్రీనివాసులు, సిపిఐ మండల కార్యదర్శి బషీర్ అహ్మద్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని చిమ్ముతోందన్నారు. ఇందులో భాగమే లవ్ జిహాద్, ఘర్వాపసీ, కామన్ సివిల్ కోడ్, మసీదుల విధ్వంసం, మూక హత్యలు పెరిగిపోయాయన్నారు. ఇప్పుడు సరికొత్తగా వక్ఫ్ బోర్డు సవరణ చట్టం ద్వారా ముస్లిములు ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి చేసేందుకు తలపెట్టిందన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

డిప్యుటేషన్‌పై పనిచేయడానికి దరఖాస్తుల ఆహ్వానం

బుక్కపట్నం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా వృత్తి విద్యా శిక్షణ కేంద్రంలో డిప్యుటేషన్‌పై లెక్చరర్స్ గా పని చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డైట్ కళాశాలలో 16 లెక్చరర్ పోస్టులకు గాను దరఖాస్తులు కోరుతున్నామన్నారు. 58 సంవత్సరాల లోపు గల ఉమ్మడి అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న ఆసక్తి గల ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు పదవ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులకు 16,17వ తేదీలలో రాత పరీక్ష, 19వ తేదీన జిల్లా కమిటీ ద్వారా ఎంపిక చేయడం తెలిపారు. కావున ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. మండల పరిధిలోని తుమ్మల, మల్లనేని పల్లి గ్రామాలలో శుక్రవారం రూరల్ ఎస్ ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో గ్రామ సభ ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు అందరు గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పీడీ పోస్టుల రద్దు అమానుషం

ప్రజాశక్తి - బత్తలపల్లి

కళాశాలలోనూ, పాఠశాలలను విద్య పరంగా ఎన్నో పెనుమార్పులు తెస్తామంటూ చెబుతున్న కూటమి ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పీడీ పోస్టులు రద్దు చేస్తూ ఇతర సబ్జెక్టులకు మార్పు చేస్తూ ఉత్తర్వులివ్వడం విచారకరమని ఆంధ్ర ప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ సభ్యులు విచారం వ్యక్తం చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లాస్కర్ నాయక్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీ నారాయణ, ట్రెజరర్ బాబా ఫక్రుద్దీన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.నరసింహారెడ్డి, ,ప్రభాకర్,రాజశేఖర్, గోపాల్ రెడ్డి మాట్లాడుతూ కరోనా కాలంలో విద్యార్థులు సెల్ఫోన్లకు అలవాటుపడి ఇప్పుడిప్పుడే క్రీడలవైపు మొగ్గుచూపుతున్నారన్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం గొడ్డలి పెట్టులా ఈ నిర్ణయం తీసుకోవడం బాధాకరమన్నారు. ఈ నిర్ణయం విద్యార్థులకు, క్రీడాకారులకు తీవ్ర నష్టం వాటిల్లే విధంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో 199 పీడీ పోస్టులు రద్దు చేసి ఇతర సబ్జెక్టులకు మార్పు చేయడం చాలా అన్యాయమైన విషయమన్నారు. ఈ కన్వర్షన్ ను ఆపకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటించి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడుతామని వారు హెచ్చరించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ప్రధాన పురోహితులు హరిస్వామి, గురుస్వామి తెలిపారు. శనివారం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 15వ తేదీన ముగుస్తాయని తెలిపారు. కాగా స్వామి వారికి ఇష్టమైన గరుడ వాహన సేవ పదవ తేదీ, 11వ తేదీన కళ్యాణోత్సవం, 12వ తేదీన రథోత్సవం, వంటి సేవలు జరుగుతాయని చెప్పారు.